అవినీతికి కేరాఫ్ కాంగ్రెస్ పార్టీ

- బీఆర్ఎస్ ప్రభుత్వానిది సుపరిపాలన
- ఆరు గ్యారంటీలను నమ్మొద్దు
- మరోసారి ఆశీర్వదించి ఆదరించండి
- బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి


గుమ్మడిదల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): 11 సార్లు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్ పార్టీ అవినీతికి, అరాచకాలకు నిదర్శనంగా నిలిచిందని బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. గుమ్మడిదల మండల పరిధిలోని కొత్తపల్లి, నల్లవల్లి, మంబాపూర్, రామిరెడ్డి బావి, వీరన్నగూడెం, మొల్లగూడెం, కానుకుంట అనంతారం గ్రామాల్లో శుక్రవారం రోడ్ షో, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ 11 సార్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అవినీతికి కేరాఫ్‌గా నిలిచిందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం, రైతు రుణమాఫీ తదితర సంక్షేమ పథకాల్లో కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. లక్ష రూపాయల నిధుల కోసం సంవత్సరాల తరబడి కార్యాలయాలు చుట్టూ చెప్పులరిగేవిధంగా తిరిగే పరిస్థితులు ఉండేవన్నారు. వికేంద్రీకరణలో భాగంగా గుమ్మడిదల మండలాన్ని ఏర్పాటు చేసి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సీఎస్ఆర్ సొంత నిధులతో మౌలిక సదుపాయాలతో పాటు గుడులు, బడులు, మసీదులు చర్చిలతో పాటు మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేశామని తెలిపారు. కారు గుర్తుపై ఓటు వేసి మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీపీ ప్రవీణ విజయభాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, వైస్ఎంపీపీ నక్కా మంజులవెంకటేష్‌గౌడ్, పార్టీ అధ్యక్షుడు షేక్ హుస్సేన్, సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సర్పంచులు ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన తెల్లాపూర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు


ముత్తంగి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు

కాంగ్రెస్‌కు భారీ షాక్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నియోజకవర్గంలో బీఆర్ఎస్‌లో చేరికల జోరు కొనసాగుతోంది. తాజాగా తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీటీసీలు ఖానాపురం మోహన్‌రెడ్డి, రత్నం, సీనియర్ నాయకులు వడ్డే నరసింహ, పెంటయ్య, సత్యనారాయణ, గంగారాం తదితరులు బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి సమక్షంలో గులాబీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి, వైస్‌చైర్మన్ రాములుగౌడ్, పార్టీ అధ్యక్షుడు దేవేందర్‌యాదవ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటెయ్యండి

పటాన్‌చెరు టౌన్: బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కార్పొరేటర్ కుమార్‌యాదవ్ అన్నారు. పటాన్‌చెరు పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



పటాన్‌చెరు: సంక్షేమ పథకాలతోనే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ సపానదేవ్ అన్నారు. శుక్రవారం అమీన్‌పూర్ పరిధిలోని జవహర్‌లాల్‌నగర్‌లో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందని వివరించారు. కార్యక్రమంలో అమీన్‌పూర్ కౌన్సిలర్ యూనిస్ మాజీ వార్డుసభ్యులు చిత్తారెడ్డి, నాయకులు బాబుల్‌రెడ్డి, వెంకట్‌రావు, జహంగీర్ పాల్గొన్నారు.

'అభివృద్ధికి కేరాఫ్ పటాన్‌చెరు నియోజకవర్గం'

అభివృద్ధికి కేరాఫ్‌గా పటాన్‌చెరు నియోజకవర్గం నిలిచిందని పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ, బీఆర్ఎస్ నేత శ్రీకాంత్‌గౌడ్ అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నరేందర్‌గౌడ్, రాజగోపాల్‌యాదవ్, ధనరాజ్, డిడి సాయి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

పటాన్‌చెరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు మెడ్వాన్ డైరెక్టర్ మధుసూదన్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండల పరిధిలోని రామేశ్వరంబండ వీకర్‌సెక్షన్ కాలనీలోని ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో పార్కర్ హనీ ఇండియా వారి సహకారంతో మెడ్వాన్ స్వచ్ఛంద సంస్థ వారు బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసేందుకు అనేక కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో పార్కర్ మేనేజర్ శ్రీరామ్ వెంకట రమణ, గ్రామపెద్దలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, మెడ్వన్ కోఆర్డీనేటర్ ముజిం, ఆఫీజ్, అముదయ్య పాల్గొన్నారు.

'పోలీసుల తీరు సరికాదు'

పటాన్‌చెరు టౌన్: చట్‌పూజకు అనుమతి కోరితే పోలీసులు, వ్యవహరించిన తీరు సరికాదని, బీఆర్ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి కనుసన్నల్లో పటాన్‌చెరు పోలీసులు ఉన్నారని బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ ఆరోపించారు. పటాన్‌చెరు పట్టణంలోని నందీశ్వర్‌గౌడ్ నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ ఆధ్వర్యంలో ఈనెల 18న నిర్వహించనున్న చట్‌పూజకు పోలీసులను అనుమతి కోరితే కాలయాపన చేశారన్నారు. దీంతో ఆందోళన చేస్తే దానిని మార్కెట్‌కు మార్చుకోవాలని పోలీసుల సూచించారని తెలిపారు. పోలీసు వ్యవస్థను అడ్డుపెట్టుకొని ఎమ్మెల్యే మహిపాల్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని మండిపడ్డారు. మహిపాల్‌రెడ్డికి రాజకీయ బిక్ష పెట్టింది నేనేనని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, నర్సింగరావు, నగేష్, శివ పాల్గొన్నారు.

చెండికాంబ ఆలయంలో పూజలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండిలో కొలువైన చండికాంబ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీకమాసం మొదటి శుక్రవారం సందర్భంగా ఆలయ అర్చకులు అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.


చండికాంబ అమ్మవారు

క్లుప్తంగా

బీఎస్పీలో చేరికలు

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని కొడకంచి మాజీ సర్పంచ్ శ్రీశైలం ఆధ్వర్యంలో ఆయా పార్టీల నాయకులు, యువకులు శుక్రవారం బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి నీలం మధు సమక్షంలో బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో చేరినవారికి తగిన ప్రాధాన్యత ఇస్తామన్నారు. కొడకంచి గ్రామంలో నీలం మధుకు మద్దతుగా ఆయన సతీమణి కవిత ప్రచారాన్ని నిర్వహించారు.

ప్రధానోపాధ్యాయుడికి ఆత్మీయ వీడ్కోలు


నర్సింహులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

జోగిపేట(అందోల్): జోగిపేట జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన నర్సింలును ప్రధానోపాధ్యాయుడు నరేష్‌కుమార్ అధ్యక్షతన ఆత్మీయ వీడ్కోలు నిర్వహించారు. ఈ సందర్భంగా నర్సింహులును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరైన ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకవర్గ సభ్యులు మాణయ్య, ఎంఈఓ కృష్ణ పీఆర్టీ యూ అధ్యక్షుడు నరోత్తంకుమార్, ప్రధాన కార్యదర్శి రాజమల్లు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మధుసూధన్, ఉపాధ్యాయులు మంజ్యానాయక్, ఆశయ్య, అజిత్ ప్రసాద్, మౌలానా, కృష్ణయ్య, రమేష్‌కుమార్, త్రినాథరావు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరిక

హత్నూర(సంగారెడ్డి): హత్నూర గ్రామానికి చెందిన బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి చాకలి నవీన్ మంత్రి హరీశ్‌రావు సమక్షంలో శుక్రవారం బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన బీజేపీ నాయకులు త్వరలోనే బీఆర్ఎస్‌లో చేరుతారని తెలిపారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

కోహీర్(జహీరాబాద్): మండల పరిధిలోని మనియారపల్లి గ్రామంలోని యూపీఎస్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. జేబీఎస్ డయాగ్నస్టిక్ డాక్టర్ సీతారామరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా బ్లడ్ గ్రూప్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అర్జున్ చవాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

నారాయణఖేడ్: బీఆర్ఎస్ ఎంపీపీతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఉపసర్పంచ్‌లు, నాయకులు బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేశ్ షెట్కార్‌ల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరినవారిలో ఖేడ్ ఎంపీపీ కర్ర చాందీబాయి చౌహాన్, ఎంపీటీసీలు రాంసింగ్ (ర్యాలమడుగు), సరోజ విఠల్ (పంచగామ), సర్పంచ్‌లు సుశీల (చల్లగిద్ద తండా), రాజేష్ (పీర్లతండా), విఠల్‌నాయక్ (మాణిక్‌నాయక్ తండా) ఆరుగురు ఉప సర్పంచ్‌లు, బంజారా సేవాలాల్ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ చౌహాన్, వైఎస్సార్ టీపీ జిల్లా అధ్యక్షుడు, మేకలు, గొర్రెల పెంపకందారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బాపు మల్‌శెట్టి ఉన్నారు.

ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

- ధరణి పోర్టల్‌ను రద్దు చేసి రైతులకు న్యాయం చేస్తాం
- ఆరు గ్యారంటీలను అమలు చేస్తాం
- కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్


పార్టీలో చేరినవారికి కండువాలు కప్పుతున్న కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్


రాఘవేంద్రకు నియామకపత్రం అందజేస్తున్న నాయకులు

ఝరాసంగం(జహీరాబాద్): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ అన్నారు. వస్తున్నా..మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఝరాసంగం, పొట్టిపల్లి, బర్దీపూర్, బిడెకన్నె, సిద్దాపూర్, టోప్యానాయక్‌తండా, బోప్పన్‌పల్లి, ప్యారవరం, బోరెగాం గ్రామాల్లో శుక్రవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ధరణి పోర్టల్‌ను ప్రవేశపెట్టి వేలాది ఎకరాల భూములన దండుకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దు చేసి రైతులకు ఆ భూములను తిరిగి అందించి న్యాయం చేస్తామని తెలిపారు. 1200మందికి పైగా ఆత్మబలిదానాలతో సాధించుకున్న తెలంగాణ ఆగమైపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ 6 గ్యారెంటీలను అధికారంలోకి రాగానే అమలు చేస్తామని వివరించారు. అనంతరం ఝరాసంగంలో ఏర్పాటు చేసిన ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకేనని ముదిరాజ్ సంఘం సభ్యులు ప్రకటించారు. కుప్పానగర్ గ్రామానికి చెందిన రాఘవేంద్రను యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా నియమించారు. బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు మడుపతి చంద్రశేఖర్, శివన్న, రాములు, రమేష్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్, ఎంపీపీ దేవదాసు, సర్పంచు ఫోరం మండల మాజీ అధ్యక్షుడు రుద్రప్ప పాటిల్, వైస్ఎంపీపీ మల్లన్నపాటిల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్‌పాటిల్, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సంగన్న ముదిరాజ్ పార్టీ, సీనియర్ నాయకులు హుగ్గెల్లి రాములు, ముల్తానీ, మారుతిరావు పాటిల్, గుండప్ప, వీరోషెట్టి పాటిల్, వేణుగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

'ప్రశ్నిస్తే.. బెదిరించడం సరికాదు'

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని పిల్లోడి గ్రామంలో అభివృద్ధి ఎందుకు చేయలేదని ప్రశ్నించిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను బీఆర్ఎస్ అభ్యర్థి చంటి క్రాంతికిరణ్ బెదిరించడం సరికాదని మాజీ ఎంపీపీ రాంరెడ్డి, సర్పంచ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, పెద్దగోపులారం ఎంపీటీసీ పాండు మండిపడ్డారు. బుదేరాలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉన్నత స్థానంలో ఉన్న ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ కాంగ్రెస్ అభ్యర్థి దామోదర రాజనర్సింహ, సతీష్‌కుమార్‌ను అమర్యాదగా మాట్లాడటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో బుదేరా మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌రావు, తాటిపల్లి వెంకట లక్ష్మారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సతీష్‌కుమార్, తాటిపల్లి సర్పంచ్ అంజిరెడ్డి, నాయకులు సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు స్లిప్‌ల పంపిణీ పరిశీలన

హవేళిఘనాపూర్(మెదక్): మండల పరిధిలోని గుట్టకిందిపల్లి, ఖాజిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో ఓటరు స్లిప్‌ల పంపిణీ కార్యక్రమాన్ని తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు కలిగిన ప్రతీ ఒక్కరికి స్లిప్‌లు పంపిణీ చేయాలన్నారు. ఎన్నికల్లో ఎవరైనా డబ్బు, మద్యం పంపిణీ చేసి ప్రలోభాలకు గురి చేసేలా చేస్తే సీ - విజిల్ యాప్ ద్వారా, 1950కు ఫిర్యాదు చేస్తే వెంటనే అధికారులు స్పందించి, చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఎల్ఓలు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

గీతం విశ్వవిద్యాలయం సందర్శన

అభ్యాస అనుభవంలో 'ఆవిష్కార్' విద్యార్థుల ప్రతిభ

పటాన్‌చెరు టౌన్: ఆవిష్కార్ జూనియర్ కళాశాల విద్యార్థులు, వారి అధ్యాపకులతో పాటు రుద్రారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విలువైన అభ్యాస అనుభవాన్ని పొందడంతో పాటు నాణ్యమైన విద్య, పరిశోధన, కార్యనిర్వాహక శిక్షణ ప్రపంచాన్ని అన్వేషించే అవకాశాన్ని పొందారు. గీతం విద్యా సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమం విద్యార్థులు, అధ్యాపకుల నైపుణ్యాలు, జ్ఞానాన్ని పెంపొందించడం లక్ష్యంగా పెట్టుకుంది. మూడు బృందాలుగా విభజించిన సుమారు 275 మంది 12వ తరగతికి చెందిన ఎంపీసీ విద్యార్థులు గీతంలోని వివిధ విభాగాలు, మౌలిక సదుపాయాలు, అధునాతన ప్రయోగశాలలు, అత్యాధునిక గ్రంథాలయం వంటి వాటిని సందర్శించారు. ఏరో క్లబ్, జీ ఎలక్ట్రా, నైపుణ్యాభివృద్ధి కేంద్రం, సివిల్, మెకానికల్, ఏరో స్పేస్ ఇంజనీరింగ్ ల్యాబ్‌లను సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గీతం యాజమాన్యం మాట్లాడుతూ ఆవిష్కార్ విద్యార్థులను గీతం విశ్వవిద్యాలయానికి స్వాగతించడం ఆనందంగా ఉందని, నాణ్యమైన విద్య, వివిధ రంగాల్లోని అపార కెరీర్ అవకాశాలు జూనియర్ కళాశాల విద్యార్థులకు తెలియజేశామని అధ్యాపకులు తెలిపారు.

అమ్మో పులి!

- మళ్లీ సంచారం
- భయాందోళనలో ఖేడ్, జహీరాబాద్, అందోల్ మండలాల వాసులు


చిరుత పాదముద్ర సేకరిస్తున్న అధికారి

నారాయణఖేడ్: ఏడెనిమిది నెలలు కన్పించని చిరుత కదలికలు మళ్లీ మొదలయ్యాయి. రెండేళ్లుగా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని పలు గ్రామాల పరిసరాలతోపాటు జహీరాబాద్ నియోజకవర్గంలోని న్యాల్‌కల్ మండలం, అందోల్ నియోజకవర్గంలోని రేగోడ్ మండల పరిధిలోని గ్రామాల్లో కన్పిస్తోంది. వారం క్రితం సిర్గాపూర్ మండల కేంద్ర శివారులో రైతు ఏసు తన షెడ్డులో కట్టేసిన దూడపై చిరుత దాడి చేసి హతమార్చింది. పది రోజుల క్రితం న్యాల్‌కల్ మండలం ముంగి గ్రామ శివారులో చిరుత సంచారాన్ని బైక్‌పై వస్తున్న ఇద్దరు గమనించి గ్రామస్తులకు వివరించారు. 15 రోజుల క్రితం రేగోడ్ మండలం పోచారం గట్టుపై రైతులకు చిరుత కన్పించింది. మనూరు మండలంలోని దుదగొండ, బోరంచ శివార్లలో సైతం 20 రోజుల క్రితం పులి సంచారాన్ని రైతులు గుర్తించారు.

ఆరునెలల క్రితం జరిగిన ఘటనలు

సంజీవన్‌రావుపేట్‌లో ఉమ్మాయి బుచ్చయ్య, అవుటి మొగులయ్య, పోశెట్టి, విఠల్, భూపాల్‌లకు చెందిన దూడలను హతమార్చి తినేసింది. కల్హేర్ మండలం బల్కంచెల్క తండాలో మూడ్ దశరత్‌కు చెందిన 25 గొర్రెల మందపై డాడిచేసి హతమార్చింది. కద్పల్, నాగ్‌ధర్ గ్రామాల్లో రెండు చొప్పున దూడలను హతమార్చింది. ర్యాకల్, రాపర్తి గ్రామాల శివార్లలోనూ లేగదూడలను చంపేసింది. సంజీవన్‌రావుపేట్, నాగ్‌ధర్, క్రిష్టాపూర్, ఖాజాపూర్, అలికాన్‌పల్లి, బాచేపల్లి, సిర్గాపూర్, కడ్పల్, ర్యాకల్, రాపర్తి తదితర గ్రామాల శివార్లలో చిరుత సంచారం కన్పిస్తోంది. కల్హేర్, సిర్గాపూర్, ఖేడ్ మండలాల పరిసరాల్లో రెండేళ్ల నుంచి కనిపిస్తున్న చిరుత, ఇటీవల మనూరు, రేగోడ్, న్యాల్‌కల్ మండలాల పరిసరాల్లో కన్పించిన పులి ఒకటా లేక వేర్వేరా అని ఆందోళన గ్రామీణుల్లో నెలకొంది.

రెండు చిరుతలు

ఆయా ప్రాంతాల్లో సంచరిస్తున్న చిరుతలు రెండు వేర్వేరు. గ్రామీణులు జాగ్రత్తగా ఉంటూ, వ్యవసాయ క్షేత్రాలకు గుంపులు గుంపులుగా వెళ్లాలి. రాత్రి సమయాల్లో చిన్న పిల్లలు బయటకు రానివ్వొద్దు. మూగజీవాలను వ్యవసాయ క్షేత్రాల్లోని కొట్టాల్లో కాకుండా ఇళ్లల్లో కట్టేసుకోవాలి.

– కె.చంద్రశేఖర్, రేంజి అధికారి, నారాయణఖేడ్

అభివృద్ధిని చూడండి

ములుగు(గజ్వేల్): తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తరువాత జరుగుతున్న అభివృద్ధిని యువత చూడాలని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి అన్నారు. అంజిరెడ్డి నిర్మాతగా, హీరో అనిల్ మొగిలి ముఖ్యపాత్రలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై తీసిన 'శపథం' లఘు చిత్రం పోస్టర్‌ను ములుగులో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వలాభం, రాజకీయ జీవితం కోసం ప్రజలను మోసం చేసే వారికి గుణపాఠం చెప్పేలా, తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేసింది ఎవరు అని అర్థం చేసుకునే విధంగా ఈ డ్యాకుమెంటరీ రూపొందించామన్నారు. సహ నిర్మాతగా గోలి సంతోష్‌కుమార్ గుప్త, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా రాచర్ల నరేష్‌గుప్తా సారథ్యంలో తీసినటువంటి శపథం డాక్యుమెంటరీ వీడియోను త్వరలో విడుదల చేస్తామన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మి మోసపోవొద్దు

- అభివృద్ధిని చూసి ఓటెయ్యండి
- సంక్షేమ పథకాలతో అన్నివర్గాలకు లబ్ధి
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మొద్దు
- నియోజకవర్గం అభివృద్ధికి కృషి
- బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు


రత్నాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

న్యాల్‌కల్(జహీరాబాద్): బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని, కాంగ్రెస్, బీజేపీల హామీలను నమ్మొద్దని బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు అన్నారు. మండల పరిధిలోని చినిగెపల్లి, మెరియంపూర్, రత్నాపూర్, మల్గి, డప్పూర్, అత్నూర్ గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మాణిక్‌రావు మాట్లాడుతూ బీఆర్ఎస్ తొమ్మిదిన్నర పాలనలో అన్నివర్గాల సంక్షేమం కోసం రైతుబంధు, రైతుబీమా, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితబంధు, దళితులకు మూడెకరాల భూమి, కల్యాణలక్ష్మీ, షాదీముబారక్, వృద్ధాప్య పింఛన్లు, కేసీఆర్ కిట్, బీసీ బంధు, గొల్లకుర్మలకు గొర్రెల పంపిణీ తదితర సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేశారని వివరించారు. 50 ఏళ్లకు పైగా రాష్ట్రాన్ని పాలించిన పార్టీలు ప్రజా సమస్యలను పట్టించుకోలేదన్నారు. కానీ.. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొమ్మిదున్నర ఏళ్లల్లోనే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. మరోసారి ఆశీర్వదించి ఎమ్మెల్యేగా గెలుపించాలని కోరారు. కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవిందర్, మాజీ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, వైస్ ఎంపీపీ గౌసొద్దీన్ నాయకులు భాస్కర్, శ్రీకాంత్‌రెడ్డి, బస్వరాజ్‌పాటిల్, మారుతి యాదవ్, రవికుమార్, సయ్యద్ శకీల్, ధన్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.


మాణిక్‌రావుకు స్వాగతం పలుకుతున్న టీఆర్ఎస్ నాయకులు


ఝరాసంగం మండల కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాణిక్‌రావును గెలిపించండి

ఝరాసంగం(జహీరాబాద్): ప్రజాసంక్షేమం కోసం కృషి చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి మాణిక్‌రావును మరోసారి ఆశీర్వదించి గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేశం పిలుపునిచ్చారు. ఝరాసంగం మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశం మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. బీఆర్ఎస్ హయాంలో చేపట్టిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని కోరారు. సమావేశంలో బీఆర్ఎస్ ఎన్నికల మండల ఇన్‌చార్జి నర్సింహగౌడ్, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు జగదీశ్వర్, ఎంపీటీసీ రాజు, ఝరాసంగం టౌన్ అధ్యక్షుడు ఎజాజ్‌బాబా, నాయకులు రాజు, సంతోష్‌కుమార్ పాటిల్, నాగేశ్వర్ సజ్జన్, శివశంకర్‌పాటిల్, సంగమేశ్వర్, హమీద్ తదితరులు పాల్గొన్నారు.